క్లుప్తంగా

ఘనంగా భీమరాయుడి జెండా ఆవిష్కరణ

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో వెలిసిన బల భీమసేన స్వామి జెండా ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏటా కర్ణాటకలోని మోత్కుపల్లి భీమరాయుడి జాతరను పురస్కరించుకుని పౌర్ణమి రోజున ఇక్కడి దేవాలయం దగ్గర భీమరాయుడి జెండా ఉత్సవాలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆంజనేయస్వామి దేవాలయం నుంచి బల భీమసేన స్వామి ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. ఈ ఉత్సవాల్లో చిన్నారుల చెక్క భజన కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హస్సేన్‌పూర్ పాఠశాలలో గణితమేళా


విద్యార్థులు తయారు చేసిన ఆకృతులు

కొడంగల్ రూరల్: గణితమేళా కార్యక్రమాన్ని మండల పరిధిలోని హస్సేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా గణిత పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. గణిత శాస్త్రానికి సంబంధించి ప్లస్, మైనస్, గుణింతాలు, భాగహారాలకు చెందిన వివిధ ఆకృతులను, ద్రవాలను కొలిచే పాత్రలు, గణిత సూత్రాలు విద్యార్థులు తయారుచేశారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

బంట్వారం: దైవ భక్తితో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మర్పల్లి ఏఎంసీ మాజీ చైర్మన్ దుర్గం చెరువు మల్లేశం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మల్లేశం మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గురుస్వామి నాగభూషణం, అయ్యప్ప స్వాములు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పడిపూజ

తాండూరు: తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 18న అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించనున్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనంలో పడి పూజ చేపట్టనున్నారు. అందుకోసం పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యారు. పడిపూజకు 5 వేల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉండటంతో దానికి తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రీడా దుస్తుల అందజేత


దుస్తులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దోమ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేత రాములుగౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు మండల స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొని సత్తాచారు. ఈ మేరకు జిల్లా స్థాయికి ఎంపిక కావడంతో విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సత్యయ్యగౌడ్, బందయ్య, బాల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, అబ్దుల్‌రహూఫ్, మైబుజానీ, అఖిల్, లక్ష్మీనారాయణగౌడ్, కొండారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు సత్కారం



యాలాల: యూత్ కాంగ్రెస్ మండల నూతన అధ్యక్షుడు అగ్గనూరు వీరేశంను సోమవారం ముదిరాజ్ సంఘ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వీరేశం ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ పటిష్టానికి కృషి చేస్తామని నాగసముందర్ గ్రామ ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు మెట్టు వెంకటేష్ అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు యువత పాటుపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ ప్రతినిధులు ఉన్నారు.

ముమ్మరంగా ఇంటింటి సర్వే

- ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాల సేకరణ
- ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది
- నెలాఖరులోపు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు


రంగంపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

పరిగి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను అధికారులు ముమ్మరంగా పరిశీలిస్తున్నారు. ప్రతి దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఇందిరమ్మ కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. పంచాయతీల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డుల ఇన్‌చార్జిలు సర్వే చేపడుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో సర్వేను పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్నారు. నెలాఖరులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

దరఖాస్తుల ఆధారంగా

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని, సొంత ప్లాట్ ఉన్న వారికి మొదటి అవకాశం కల్పిస్తామని చెప్పింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లాలో దాదాపు 2,56,000 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఆ దరఖాస్తులన్నింటినీ ప్రత్యేక యాప్‌నకు అనుసంధానం చేశారు. ప్రస్తుతం ఆయా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు.

సర్వేలో వివరాలు ఇలా..

ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసిన వారి వివరాలను ఆన్‌లైన్ చేశారు. ప్రస్తుతం జిల్లాలోని 585 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, 4 మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా వార్డు ఇన్‌చార్జిలకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే బాధ్యతను అప్పగించారు. వారు తమ సెల్‌ఫోన్లో ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను నమోదు చేస్తున్నారు. యాప్‌లో ఉన్న వివరాలిలా ఉన్నాయి. మీకు సొంత ఇల్లు ఉందా, లేదా.. కిరాయి ఇంట్లో ఉంటున్నారా.. అది రేకుల ఇల్లా, లేక స్లాబ్ ఇల్లా. సదరు ఇంటి ఫొటో తీసుకుంటున్నారు. ఎంత మంది కుటుంబ సభ్యులు ఉన్నారు, వారికి ఏమైన భూములు, ప్లాట్లు ఉన్నాయా అనే వివరాలను పరిశీలిస్తున్నారు. కార్లు ఇతర ఆస్తుల వివరాలు ఆధార్ అనుసంధానంతో ఆన్‌లైన్‌లో కనిపించినప్పటికీ గతంలో వాహనాలు ఉండవచ్చు, ప్రస్తుతం అమ్మవచ్చు అందువల్ల మళ్లీ సంబంధిత దరఖాస్తుదారులను అడిగి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొందారా అనే వివరాలను కూడా తెలుసుకుని నమోదు చేస్తున్నారు.

జోరుగా సర్వే

గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి పూర్తి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. యాప్‌లో అడిగిన ప్రశ్నలన్నింటికి ప్రజలు సమాధానం ఇవ్వాల్సి ఉంది. అధికారులు సూచించిన గడువులోపు సర్వేను పూర్తి చేస్తాం.

– కరీం, ఎంపీడీఓ, పరిగి

‘స్థానిక’ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం

బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి


కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

నవాబుపేట: అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. మండల కేంద్రంలోని మాణిక్‌ప్రభు జాతర ఉత్సవాలకు సోమవారం కార్తీక్‌రెడ్డి హాజరయ్యారు. పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమవుతోందన్నారు. అతి తక్కువ కాలంలో పార్టీ విశ్వసనీయత కోల్పోయిందన్నారు. మండలంలోని గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయన్నారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యే యాదయ్య పార్టీ మారారు. ఇప్పటికైనా రోడ్లు బాగుచేయించేందుకు చొరవ తీసుకోవాలి. అనంతరం పలు గ్రామాల యువత బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కార్తీక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చేవెళ్ల నియోజకవర్గ నాయకుడు దేశమొల్ల ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, జగన్‌రెడ్డి, విజయ్‌కుమార్, సయ్యద్‌గౌస్, మహేశ్వర్‌రెడ్డి, శాంతకుమార్, సంతోష్‌కుమార్, లింగం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన నిలబడుతాం


సీసీఐ ఫ్యాక్టరీలో చెక్కులతో కార్మికులు, కాంగ్రెస్ శ్రేణులు

తాండూరు రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని మాజీ ఎంపీపీ శరణు బసప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యులు రాజ్‌కుమార్, శివకుమార్ అన్నారు. మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామ శివారులో ఉన్న సీసీఐ ఫ్యాక్టరీలో రిటైర్మెంట్ అయిన కార్మికులకు యజమాన్యం సోమవారం గ్రాడ్యుటీ చెక్కులను అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యజమాన్యంపై పోరాటం చేయడంతో దిగి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్మికుల పక్షాన ఉంటామని పేర్కొన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కోసం కూడా కృషి చేస్తామన్నారు. కార్మికులు ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సీసీఐ యజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, కార్మికులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు భవనాలు నిర్మించాలి


అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

- ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా, వినతి

చేవెళ్ల: కళాశాల విద్యార్థులకు సంబంధించి మంజూరైన వసతి గృహాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం కళాశాల విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలో 2018లో ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలు మంజూరైనట్లు చెప్పారు. అప్పటి నుంచి వీటికి సొంత భవనాలు లేకపోవటంతో అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని, అద్దె భవనాల్లో సౌకర్యాలు లేకపోవటంతో ఇటీవల పాఠశాల విద్యార్థులు ఉండే వసతి గృహంలోకి మార్చారన్నారు. అక్కడ పాఠశాల, కళాశాల విద్యార్థులకు గదులు, సౌకర్యాలు సరిపడకపోవటంతో మరింత ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు వెంటనే సొంత భవనాలు మంజూరు చేయించి నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ నాయకులు సమీర్, చందు, చరణ్‌గౌడ్, అనిల్‌కుమార్, నవీన్, సందీప్, ఆసిఫ్, శివ, కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నందిగామ: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి సూచించారు. మండల పరిధిలోని చేగూరులో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో భాస్కర లా కళాశాల ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి శ్రీదేవి హాజరై మాట్లాడుతూ.. సమాజంలో నిత్యం జరుగుతున్న పలు సంఘటనలు, వాటి పర్యావసానాలు, చట్టాలు, కోర్టులు ఇచ్చే తీర్పులు, సెక్షన్లు తదితర వాటిపై అవగాహన అవసరమన్నారు. అంతేగాకుండా అనవసరమైన విషయాలలో జోక్యం చేసుకోవద్దని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని సూచించారు. కార్యక్రమంలో లా కాలేజీ ప్రిన్సిపాల్ భగవద్గీత, పారా లీగల్ వలంటీర్లు సంజీవ, బాల్‌రెడ్డి, లా కాలేజీ అధ్యాపకులు అనిల్‌సింగ్, స్నేహలత, విజేత రాణి, హృషికేశ్, పటాన్‌ఖాన్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాజురెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వారం పాటు తహసీల్దార్ సెలవు

యాలాల: మండల తహసీల్దార్ అంజయ్య వారం రోజుల పాటు సెలవుపై వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో ఆయన సెలవు పెట్టినట్లు సమాచారం. కాగా ఇన్‌చార్జి బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్ నరేష్ గౌడ్ లేదా ఆర్డీఓ కార్యాలయ ఏఓకు అదనపు బాధ్యతలు ఇస్తారని సమాచారం. కాగా గ్రూప్–2 పరీక్షల నిర్వహణలో డీటీ ఉన్నారు. సోమవారం సాయంత్రం వరకు ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికి ఇవ్వలేదు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



దౌల్తాబాద్: మండల కేంద్రంలోని హరిజన్‌చేరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న 15 మంది విద్యార్థులకు వైద్యులు శ్రీకాంత్, ఏఎన్ఎం ఎల్లమ్మలు పరీక్షలు చేశారు. అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పెంట్యానాయక్ తదితరులున్నారు.

దౌల్తాబాద్‌లో విద్యార్థులకు అల్పాహారం ప్రారంభం


చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ వడ్డిస్తున్న నిర్వాహకులు

దౌల్తాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి అల్పాహారం(టిఫిన్) ప్రారంభం అయింది. హరే రాం హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వారం క్రితమే కొడంగల్‌లో మొదలు పెట్టారు. అయితే దౌల్తాబాద్ మండలంలో సోమవారం నుంచి అన్ని పాఠశాలల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌గా ఇడ్లీని వడ్డించారు.

మా వాళ్లను విడుదల చేయండి


జైలులో ఉన్న తమ వారిని విడుదల చేయాలని ఆందోళన చేస్తున్న గిరిజన మహిళలు (ఫైల్)

- ఆవేదన వ్యక్తం చేసిన గిరిజన మహిళలు
- లగచర్ల ఘటనపై బీఆర్ఎస్ పోరు హర్షణీయమని వెల్లడి

దుద్యాల్: లగచర్ల ఘటన మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు వచ్చింది. రైతులకు బేడీలు వేసి జైలులో పెట్టడంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా లగచర్ల ఘటనపై చర్చ జరిపాలని పట్టుబట్టారు. దీంతో తమ సమస్యను లేవనెత్తినందుకు స్థానిక గిరిజన మహిళా రైతులు హర్షించారు. సంగారెడ్డి జైలులో మగ్గుతున్న 45 మందిని వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కసారి కూడా మాట్లాడలేదు



నెల రోజులుగా నా కొడుకు లోకేశ్ జైలులోనే మగ్గుతున్నాడు. నేటి వరకు ఒక్కసారి కూడా మాట్లాడలేదు. నా కొడుకు ఇంటికి ఎప్పుడొస్తాడో అని ఎదురుచూస్తున్నాను. బెయిల్ తిరస్కరించారు. మా వాళ్లందరిని విడిచిపెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో పోరాడుతున్నందుకు వారికి రుణపడి ఉంటాం.

– లక్ష్మీబాయి, రోటిబండ తండా

దిక్కుతోచని స్థితిలో ఉన్నాం



నా కొడుకు వినోద్‌నాయక్, మరిది శ్రీనివాస్‌నాయక్, బావ బాష్యానాయక్‌లు ముగ్గురు జైలులో నెల రోజులకుపైగానే ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నం చేయగా మంజూరు కాలేదు. ఇంటి దగ్గర మా అత్త, నేను దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. మేము చేస్తున్న పోరాటాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మద్దతుగా నిలవడం హర్షణీయం.

– సుశీలబాయి, రోటిబండా తండా


సమావేశంలో మాట్లాడుతున్న అవినాశ్‌రెడ్డి

తెలంగాణ భవన్‌కు తరలిరండి

కొడంగల్: బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు పార్టీ శ్రేణులు కదిలి రావాలని షాబాద్ మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి జైలులో వేశారని విమర్శించారు. ప్రజల మనిషిగా పేరుగాంచిన నరేందర్ రెడ్డిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పట్నం అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు తాను కొడంగల్‌కు వచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మంగళవారం కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో కేటీఆర్ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశంలో దామోదర్‌రెడ్డి, కృష్ణ, యాదగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి, చాంద్‌పాషా, మహిపాల్, రామకృష్ణ, సలీమ్, నర్మద, వెంకటయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు విస్తరణ పనులు


చురుగ్గా సాగుతున్న రోడ్డు వెడల్పు పనులు

యాలాల: మండల పరిధిలోని బాగాయిపల్లి నుంచి కమాల్‌పూర్ గేటు వరకు చేపడుతున్న రోడ్డు వెడల్పు పనులు చురుగ్గా సాగుతున్నాయి. సింగిల్ రోడ్డుగా ఉన్న ఈ మార్గంతో గతంలో ఎన్నో ప్రమాదాలు, ఇబ్బందులను వాహనదారులు ఎదుర్కొన్నారు. తాండూరు నుంచి పరిగి, షాద్‌నగర్, హైదరాబాద్ వెళ్లేందుకు ఈ మార్గం దగ్గరిదారి కావడంతో ప్రతి రోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ రోడ్డు విషయమై పలు మార్లు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లారు. కమాల్‌పూర్ నుంచి బాగాయిపల్లి వరకు రోడ్డు వెడల్పు పనులకు నిధులు మంజూరు కావడంతో పనులను ఇటీవల ప్రారంభించారు. సుమారు 5 కిలోమీటర్ల దూరం గల ఈ మార్గంలో రోడ్డు వెడల్పు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానం ముఖ్యం


విద్యార్థిని శ్రీజను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటుగా సాంకేతిక పరిజ్ఞానం, మేధోసంపత్తిని పెంపొందించుకోవాలని కుల్కచర్ల బాలికల జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైపాల్ రెడ్డి సూచించారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని వడ్ల శ్రీజ ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాలో మొదటిస్థానంలో నిలిచింది. కాగా సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థిని శ్రీజను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చందర్, భక్తవత్సలం, మ్యాజిక్ బాక్స్ కోఆర్డినేటర్ నర్సింలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు రానీయొద్దు

ఎంపీడీఓ మహేశ్‌బాబు


కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

దోమ: కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఎంఈఓ వెంకట్‌తో కలిసి పరిసరాలను తనిఖీ చేసిన అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదలతో చదువుకుంటే ఉన్నతమైన స్థానాలను అధిగమిస్తారని అన్నారు. నీటి సమస్యపై కేజీబీవీ సిబ్బంది ఎంపీడీఓ మహేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి సమస్యను తీర్చారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ఓ గీతా, ఏఎన్ఎం, ఉపాధ్యాయులు, కంప్యూటర్ ఆపరేటర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పంపిణీ

మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లను ఎంపీడీఓ మహేశ్‌బాబు అందజేశారు. మండల కేంద్రానికి 11 సదరం సర్టిఫికెట్లు రాగా, ఏపీఎం సురేశ్ దివ్యాంగులకు సమావేశం నిర్వహించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, సీసీలు సుజ్ఞాని, అంజమ్మ, అకౌంటెంట్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం


ఆంజనేయులును సన్మానిస్తున్న న్యాయవాదులు

కుల్కచర్ల: నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆంజనేయులు ముదిరాజ్ నియమితులై ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పరిగి కోర్టు ఏజీపీ బాలముకుందం సహచర న్యాయవాదులతో కలిసి సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు. రైతులకు న్యాయం జరిగేలా మార్కెట్ కార్యకలాపాలు కొనసాగాలని సూచించారు. రైతులు బాగుపడినప్పుడే వ్యవస్థ బాగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, వెంకట్ రెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.